సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 21 । సెప్టెంబర్ । 2022

సక్రమంగా సంక్షేమ పథకాల అమలు



హుకుంపేట: అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా సచివాలయ సిబ్బంది పనిచేయాలని డీపీవో కొండలరావు ఆదేశించారు. స్థానిక సచివాలయ కేంద్రం, ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఎంపీడీవో కార్యాలయం రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక సచివాలయంలో రికార్డులను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ స్థానిక ఎంపీడీవో వెంకటరమణ, ఈవోపీఈఆర్డీ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

112 కిలోల గంజాయి, ఆశీస్ మిషన్లు స్వాధీనం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్

8లో

న్యూస్‌రీల్

విధి నిర్వహణలో నిర్లక్ష్యం ఉపేక్షించం

డీఎల్‌పీవో కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో కుమార్

పెదబయలు: పంచాయతీ కార్యదర్శుల బాధ్యతారాహిత్యాన్ని, నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేదిలేదని పాడేరు డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్ హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం పెదబయలు,ముంచంగిపట్టు మండలాల పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పన్నుల వసూళ్లు, స్పందన ఫిర్యాదుల పరిష్కారం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై పంచాయతీల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ నిర్మాణంలో ప్రభుత్వ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. డెంగ్యూ, సీజనల్ వ్యాధులు నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్‌డీవోలు నర్సింగరావు,చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

దోడోదం జలపాతం అభివృద్ధికి చర్యలు



జలపాతాన్ని సందర్శించిన ఎంపీడీవో శ్రీహర్షిత్, సర్పంచ్ మొస్య తదితరులు

సాక్షి ఎఫెక్ట్..

అనంతగిరి: మండలంలోని టోకూరు పంచాయతీ చిట్టంపాడు గ్రామ సమీపంలో గల దోడోదం జలపాతం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో శ్రీహర్షిత్, సర్పంచ్ మొస్య తెలిపారు. ఈ నెల18న 'అనంతగిరుల్లో కొత్త జలపాతం' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం ఎంపీడీవో శ్రీహర్షిత్, టోకూరు సర్పంచ్ మొస్య తదితరులు దోడోదం జలపాతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ జలపాతం పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందుతుందని తెలిపారు. పంచాయతీ తీర్మానం చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందికి ఎంపీడీవో పలు సూచనలు చేశారు. కార్యదర్శిలు లక్ష్మీ, కనకబాబు, వైస్ సర్పంచ్ నర్సన్న వీరి వెంట ఉన్నారు.

మ్యుటేషన్ వేగవంతం

జేసీ శివ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

సాక్షి,పాడేరు: సమగ్రంగా భూ సర్వే చేసి, మ్యుటేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాస్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పాడేరు డివిజన్‌లోని రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. మ్యుటేషన్, భూముల సర్వే, సివిల్ సప్లై,పెండింగ్ కేసులు, ఈ-క్రాప్ బుకింగ్ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మ్యుటేషన్‌పై రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, రైతులకు పట్టాలు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే సమగ్రమైన సర్వే చేసి తహసీల్దారు తగిన నిర్ణయం తీసుకోవాలని, ఆయా నివేదికలను తమకు అందజేయాలని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజన రైతులు సాగు చేస్తున్న అన్ని పంటలకు ఈ-క్రాప్ నమోదును కూడా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను సకాలంలో పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ వి.అభిషేక్, డీఆర్‌వో బి.దయానిధి తదితరులు పాల్గొన్నారు.

వాల్తేరు ఆల్‌టైం రికార్డ్

రైలెక్కిన ప్రతీసారి ఈ రోజైనా సమయానికి గమ్యం చేరుతామా? అని అనుకునేవాళ్లం. సమయానికి రైళ్లు రాక.. రెట్టింపు సమయానికి గమ్యస్థానాలకు చేర్చే రైళ్లతో నరకం చూసేవాళ్లం. 'బండిబండి రైలుబండి.. వేళకంటూ రాదులెండి.. దీన్ని గాని నమ్ముకుంటే ఇంతేనండి ఇంతేనండి.' అంటూ నిట్టూర్పుతో సర్దుకుపోయేవాళ్లం. ఇప్పుడు పరిస్థితి మారింది. సరకు రవాణా.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చడంలో దూసుకుపోతున్న వాల్తేరు రైల్వే డివిజన్.. సమయపాలనలోనూ పర్‌ఫెక్ట్ అనిపించుకుంటోంది. నిర్ణీత సమయానికే రైళ్ల రాకపోకలు నిర్వహిస్తూ.. దేశంలోని 30 డివిజన్లలో పోటీపడి టాప్-5లో చోటు దక్కించుకుంది. జోన్ పరిధిలో నంబర్‌వన్‌గా నిలిచింది. భారతీయ రైల్వే సగటు సమయపాలనకంటే మిన్నగా వాల్తేరు డివిజన్ సేవలందిస్తుండటం విశేషం. - సాక్షి, విశాఖపట్నం

- పంక్చువాలిటీలో వాల్తేర్ డివిజన్ పర్‌ఫెక్ట్
- 30 డివిజన్లలో 5వ స్థానం, జోన్ పరిధిలో నంబర్ 1
- సమయపాలన పాటిస్తున్న 87.60 శాతం రైళ్లు
- ఇండియన్ రైల్వేస్ సగటు 82.22 శాతం

చరిత్రాత్మక డివిజన్‌గా పేరు పొందిన వాల్తేరు రైల్వే డివిజన్.. ఏటా మాదిరిగానే ఈసారీ అన్ని రంగాల్లోనూ తనదైన శైలిలో బెస్ట్‌గా నిలుస్తోంది. మౌలిక సదుపాయాల కల్పన, సరకు రవాణాలో మిన్నగా ఉండే డివిజన్.. ప్రయాణికులకు సేవలందించే విషయంలో తనదైన మార్క్ చూపిస్తోంది. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ పరిధిలో విశాఖపట్నం కేంద్రంగా వాల్తేరు డివిజన్ నడుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో 58 రైల్వేస్టేషన్లు, ఒడిశాలో 41, చత్తీస్‌గఢ్ పరిధిలో 18 రైల్వేస్టేషన్లు కలిపి మొత్తం 117 స్టేషన్ల వరకు ఈ డివిజన్ విస్తరించింది. మూడు రాష్ట్రాల్లో కలిపి మొత్తం ట్రాక్‌లైన్ 2,252.062 కి.మీ. ఇందులో 2,208.175 కి.మీ వరకు ఎలక్ట్రిఫైడ్ లైన్ ఉంది. దాదాపు డివిజన్ పరిధిలో 98 శాతం మేర ఎలక్ట్రిఫైడ్ లైన్ పూర్తి చేశారు. సుదీర్ఘ చరిత్ర ఉన్న వాల్తేరు డివిజన్ రైళ్ల రాకపోకలకు సంబంధించిన సమయపాలనలో మంచి పనితీరు కనబరుస్తోంది. డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి బాధ్యతలు చేపట్టిన తర్వాత డివిజన్ రూపురేఖలు ఒక్కసారిగా మారిపోయాయి. ప్రతి విషయంలోనూ వాల్తేర్ డివిజన్‌ను బెస్ట్‌గా చూపించేందుకు ఆయన నిరంతరం కృషి చేస్తున్నారు.

దేశ సగటుకంటే మిన్నగా...

సాధారణంగా రైళ్ల రాకపోకల విషయంలో సగటు సమయపాలన 90 శాతం వరకు ఉంటుంది. పలు ప్రాంతాల్లో ప్రకృతి విపత్తులు, ట్రాక్ సమస్యలు, అభివృద్ధి పనులు మొదలైనవి నిత్యం ఏదో ఒక చోట జరుగుతుండటం వల్ల సగటు పంక్చువాలిటీ 90 శాతంగా నిర్ధారించారు. అయితే భారతీయ రైల్వే సగటు పంక్చువాలిటీ 84.05 శాతం నుంచి 82.22 శాతానికి పడిపోయింది. ఇందుకు మిన్నగా వాల్తేరు డివిజన్ పంక్చువాలిటీ ఉండటం విశేషం. డివిజన్ సమయపాలన 87.60 శాతంగా నమోదైంది. దేశంలోని 30 రైల్వే డివిజన్ల సమయపాలనను రైల్వే బోర్డు గణించగా.. వాల్తేరు డివిజన్ 5వ స్థానంలో నిలిచింది. వెస్టర్న్ రైల్వే జోన్ పరిధిలోని వడోదర డివిజన్ 89.28 శాతంతో మొదటి స్థానంలో నిలవగా.. నార్త్‌ఈస్ట్ ఫ్రంటైర్ రైల్వేజోన్ పరిధిలో అలీపుర్దూర్ డివిజన్ 88.52 శాతంతో రెండో స్థానంలో నిలిచింది.

జోన్ పరిధిలో బెస్ట్

ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ పరిధిలోనూ వాల్తేరు బెస్ట్ డివిజన్‌గా గుర్తింపు పొందింది. ఖుర్దా డివిజన్ 78.57 శాతంతో 17వ స్థానంలో నిలిచింది. జోన్



ఓవరాల్ శాతంతో పోల్చినా.. వాల్తేర్ డివిజన్ మిన్నగా ఉంది. జోన్ల వారీగా పరిశీలిస్తే ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ 79.03శాతంతో 7వ స్థానంలో ఉంది. ఈ విభాగంలో ఈస్ట్ సెంట్రల్ రైల్వే జోన్ 89.17శాతంతో మొదటి స్థానంలో నిలిచింది.

నంబర్ వన్ వైపు అడుగులు



ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా.. వారిని గమ్యస్థానాలకు నిర్ణీత సమయంలో చేరవేసేందుకు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నాం. అన్ని విభాగాలను నిరంతరం సమన్వయం చేసుకుంటూ.. సమయపాలన విషయంలో కచ్చితత్వం పాటిస్తున్నాం. భవిష్యత్‌లో రైల్వే బోర్డు నిర్దేశించిన 90 శాతానికి పైగా చేరుకునేందుకు నిర్దిష్టమైన ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాం. డివిజన్ ఉద్యోగులు, సిబ్బంది, ప్రయాణికుల సహకారంతో లక్ష్యాన్ని చేరుకునేందుకు అడుగులు వేస్తున్నాం.

–అనూప్‌కుమార్ సత్పతి, వాల్తేరు డీఆర్ఎం

ఏవోబీలో రెడ్ అలర్ట్

- మావోయిస్టుల ఆవిర్భావ వార్షికోత్సవం నేపథ్యంలో అప్రమత్తం
- జిల్లా వ్యాప్తంగా భద్రతా చర్యలు
- ఎస్పీ సతీష్‌కుమార్



సాక్షి,పాడేరు: మావోయిస్టు పార్టీ 18వ ఆవిర్భావ వార్షికోత్సవం నేపథ్యంలో ఏవోబీ వ్యాప్తంగా పోలీసులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. బుధవారం నుంచి నిర్వహించే వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని మావోయిస్టుల పేరుతో ఓ ప్రకటన విడుదలైంది. వార్షికోత్సవాలను భగ్నం చేసేందుకు ఆంధ్రా,ఒడిశా పోలీసులు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్టు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన «సాక్షి»తో మాట్లాడుతూ జిల్లాలతో పాటు సరిహద్దులోని ఒడిశాలో కూడా పోలీసు బలగాలు సంచరిస్తున్నాయన్నారు. అన్ని మారుమూల ప్రాంతాలు, అడవుల్లో పోలీసు బలగాలతో కూంబింగ్ విస్తృతం చేశామన్నారు. డ్రోన్ కెమెరాలను కూడా వినియోగిస్తున్నామని, బాంబ్ స్క్వాడ్‌లతో మండల కేంద్రాలు,ప్రధాన జంక్షన్లు, అన్ని రోడ్లు, మారుమూల ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో తనిఖీలు చేపడుతున్నామన్నారు. అన్ని పోలీసు స్టేషన్లు, అవుట్‌పోస్టుల పరిధిలో ప్రత్యేక పోలీసు బలగాల ద్వారా నిరంతరం తనిఖీలు చేపడుతున్నామని, మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వార్షికోత్సవాలను పూర్తిగా భగ్నం చేసే లక్ష్యంగా తమ పోలీసుశాఖ పని చేస్తుందన్నారు.

వార్షికోత్సవాలపై డేగకన్ను

చింతపల్లి: మన్యంలో మావోయిస్టులకు మనుగడ లేదని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మావోయిస్టుల ఆవిర్భావ వార్షికోత్సవం సందర్భంగా గట్టి భద్రతా నిఘా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వారి కార్యకలాపాలపై దృష్టి సారించామని చెప్పారు. గిరిజనులు అభివృద్ధిని కోరుకుంటున్నారు కాని హింసను కాదన్నారు. రహదారులు, సెల్ టవర్లు ఏర్పాటు చేయడం వల్ల గిరిజనుల్లో చైతన్యం పెరిగిందన్నారు. పూర్తిగా పట్టు కోల్పోయిన మావోయిస్టులు తిరిగి పుంజుకునేందుకు అవకాశమిచ్చే ప్రసక్తే లేదన్నారు. వార్షికోత్సవం సందర్భంగా నిఘా ముమ్మరం చేశామన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. అందుకు గిరిజనులంతా సహకరించాలని ఆయన కోరారు. అసాంఘిక శక్తులు ప్రవేశిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఏఎస్పీ తెలిపారు.

21 నుంచి వార్షికోత్సవాలు

ఆంధ్ర-ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి ప్రకటన

జి.మాడుగుల: మావోయిస్టు పార్టీ 18వ వార్షికోత్సవాన్ని ఈ నెల 21నుంచి 27వరకు నిర్వహించనున్నట్టు ఆంధ్ర-ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ పేరుతో స్థానిక విలేకరులకు మంగళవారం ఓ ప్రకటన అందింది. శత్రువు ఎత్తుగడలను తిప్పికొట్టాలని పేర్కొన్నారు. సమాధాన్-ప్రహార్ దాడులను ధైర్యసాహసాలతో ఎదుర్కొంటూ ఈ సంవత్సరం దేశ వ్యాప్తంగా వివిధ స్థాయిలకు చెందిన 124మంది మావోయిస్టులు అమరులయ్యారని తెలిపారు. అమరుల్లో కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఏపీ, ఏవోబీ ఉద్యమాలకు ప్రత్యక్ష నాయకత్వం వహించిన రామకృష్ణతో పాటు విప్లవ సాంస్కృతిక సేనాని దప్పు రమేష్, ఎంకేవీ డివిజన్ కమిటీ సభ్యుడు అనిల్, ఏసీఎం సోని, పీఎం చిన్నారావు ఉన్నారని పేర్కొన్నారు.

త్వరితగతిన నాడు-నేడు పనులు

పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశం

సాక్షి, పాడేరు: పీహెచ్‌సీల్లో అసంపూర్తిగా ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. నాడు-నేడు కింద పీహెచ్‌సీల్లో చేపట్టిన పనులపై వైద్యాధికారులు, ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులతో ఐటీడీఏ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ 15 రోజుల్లో పనులు పూర్తి చేయాలని సూచించారు. అన్ని రకాల పనులు పూర్తి అయిన తరువాత వైద్యాధికారి సంతృప్తి చెందాక సంబంధిత ధృవీకరణ పత్రంపై సంతకం చేయాలని తెలిపారు. అవసరమైన ఆస్పత్రులకు ఇన్వర్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. పెదబయలు, డుంబ్రిగుడ పీహెచ్‌సీల్లో బర్త్ వెయిటింగ్ హాళ్ల నిర్వహణపై ఆరా తీశారు.

ఐదుగురు వైద్యులకు షోకాజ్ నోటీసులు

సమీక్షా సమావేశానికి హాజరు కాని ఆర్‌జే పాలెం, కోరుకొండ, యు.చీడిపాలెం, రూడకోట, కిలగాడ పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ సంపత్, డాక్టర్ సంతోష్, డాక్టర్ సుభాష్, డాక్టర్ శ్యామ్ ప్రసాద్, డాక్టర్ రమేష్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బాలసుందరబాబు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.సుజాత, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కె.లీలా ప్రసాద్, డీటీసీవో డాక్టర్ టి.విశ్వేశ్వర నాయుడు, జిల్లా మలేరియా అధికారి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

మూడు నెలల్లో భవన నిర్మాణాలు పూర్తి

కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం

రంపచోడవరం: జిల్లాలోని గ్రామ సచివాలయాలు, రైతు భరోసా, వెల్‌నెస్ సెంటర్ల భవనాల నిర్మాణాలు మూడు నెలల్లో పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాలు నుంచి మంగళవారం ఆయన జిల్లాలోని ఐటీడీఏ అధికారులు, ఇంజినీర్లు, డ్వామా పీడీ, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 349 సచివాలయ భవనాలు మంజూరు కాగా, ఇప్పటికి 40 భవన నిర్మాణాలు పూర్తి చేశారని, 37 అప్పగించారని తెలిపారు. 344 రైతు భరోసా కేంద్రాల భవనాలు మంజూరు కాగా, 32 భవనాల నిర్మాణాలు పూర్తి చేశారని చెప్పారు. మిగిలిన భవనాల నిర్మాణాలు వివిధ స్థాయిల్లో ఉన్నాయన్నారు. ఎటపాక, కూనవరం, వీఆర్ పురం మండలాల్లో నిర్మాణ పనులు ప్రారంభం కాలేదన్నారు. అక్కడున్న సమస్యలను పరిష్కరించి పనులు ప్రారంభించాలని చింతూరు ఐటీడీఏ పీవో రామశేషును ఆదేశించారు. 209 వెల్‌నెస్ సెంటర్లు మంజూరు కాగా, రెండు నిర్మాణాలు పూర్తి చేసి అప్పగించారని తెలిపారు. మరో 26 కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. భవన నిర్మాణాలకు సంబంధించి సిమెంట్,మెటీరియల్ బిల్లులు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామ సచివాలయాల్లో రోజూ సాయంత్రం 3 గంటల నుంచి ఐదు గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏల పీవోలు సూరజ్ గనోరే, ఆర్.గోపాలకృష్ణ, రామశేషు, సబ్ కలెక్టర్ కట్టా సింహాచలం, ఇంజినీర్ లావణ్యకుమార్, డ్వామా పీడీ రమేష్‌రామన్, ఈఈ డేవిడ్‌రాజ్ , గౌతమి, పీహెచ్‌వో చిట్టిబాబు, ఎంపీడీవో కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

15 రోజుల ముందే గర్భిణులను ఆస్పత్రుల్లో చేర్పించాలి

రంపచోడవరం: ప్రసవానికి 15 రోజులు ముందుగానే గర్భిణులను ఆస్పత్రుల్లో చేర్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. పోషకార మహోత్సవాల సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ సమావేశం హాలులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలికలు ఆరోగ్యంగా ఉండే విధంగా చూడాలన్నారు. గిరిజన ప్రాంతంలో మహిళలు, బాలికలకు సంప్రదాయ ఆహారం అలవాటు చేయడం, ఇతర విషయాలను ప్రోత్సాహించడం ఈ ప్రోగ్రాం లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా కొంత మంది గర్భిణులకు సీమంతం చేశారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులతో మాట్లాడి అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతాన్ని కలెక్టర్ తెలుసుకున్నారు. అంగన్‌వాడీ టీచర్లకు సెల్‌ఫోన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ కట్టా సింహాచలం, ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, కుంజం వంశీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైనవారికి కుల ధ్రువీకరణ పత్రాలు

మారేడుమిల్లి: అర్హులైన గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఆయన వై.రామవరం మండలం పాటకోట, గుర్తేడు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి గిరిజనులతో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సభలు నిర్వహించి, తద్వారా అర్హులను గుర్తించి కులధృవీకరణ పత్రాలు జారీ చేస్తామని తెలిపారు. గుర్తేడు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో త్వరలోనే వైద్యాధికారిని నియమిస్తామని తెలిపారు. పీహెచ్‌సీ రెండు అంబులెన్స్‌లను బాగుచేయించి అందుబాటులోకి తీసుకురావలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

దంచికొడుతున్న వానలు



పాడేరు మెయిన్ రోడ్డులో కురుస్తున్న వర్షం

- జిల్లా వ్యాప్తంగా 378.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రధాన గెడ్డలు, వాగులు
- జనజీవనానికి అంతరాయం

జిల్లాలో వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మిల్లీమీటర్లలో)	మండలం	వర్షపాతం (మిల్లీమీటర్లలో)
వీఆర్ పురం	42.6	పెదబయలు	15.2
మారేడుమిల్లి	36.4	అడ్డతీగల	14.2
కూనవరం	34.6	రంపచోడవరం	13.6
ఎటపాక	30.8	వై.రామవరం	12.4
అరకులోయ	23.4	గంగవరం	12.2
పాడేరు	23.2	ముంచంగిపుట్టు	12.0
రాజ వొమ్మంగి	18.2	జి.మాడుగుల	11.4
డుంబ్రిగుడ	17.4	చింతపల్లి	5.6
దేవీపట్నం	16.2	చింతూరు	4.6
		అనంతగిరి	4.2
		జి.కె.వీధి	4.6
		కొయ్యూరు	4.2

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల నుంచి మళ్లీ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం రాత్రంతా వర్షం కురుస్తూనే ఉంది. మంగళవారం మధ్యాహ్నం వరకు పలు ప్రాంతాల్లో కురిసిన కుండపోత వానతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం 12గంటల తర్వాత వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ మళ్లీ సాయంత్రం వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 22 మండలాల్లో 378.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు కలెక్టరేట్ అధికారులు పేర్కొన్నారు. రోజూ వర్షాలు కురుస్తుండడంతో జిల్లాలోని ప్రధాన వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గోదావరి, శబరి నదుల్లో కూడా వరదనీరు చేరుతోంది. వర్షాలు కురుస్తుండడంతో అన్ని మండలాల రెవెన్యూ యంత్రాంగాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ అప్రమత్తం చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ వ్యవసాయానికి మాత్రం అనుకూలంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బీఎస్ నందు 'సాక్షి'కి తెలిపారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): భద్రతా కారణాల దృష్ట్యా కేకే లైన్‌లో నడిచే ప్రయాణికుల రైళ్లను రెగ్యులేట్(గమ్యం కుదింపు)చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠీ తెలిపారు. విశాఖపట్నం–కిరండూల్(18514) ఎక్స్‌ప్రెస్ ఈనెల 26వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 27వ తేదీ వరకు ఈ రైలు దంతేవాడ నుంచి బయల్దేరుతుంది. విశాఖపట్నం–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ రైలు ఈనెల 27వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 28వ తేదీ వరకు కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి విశాఖపట్నం చేరుకుంటుంది

కేజీబీవీలో అధికారుల విచారణ



కేజీబీవీ విద్యార్థినులను విచారిస్తున్న ఏటీడబ్ల్యూవో రజని, సీడీపీవో ఝాన్సీరాణి

సాక్షి,పాడేరు: నాణ్యమైన మెనూ అమలుకావడం లేదని, పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పదిరోజుల కిందట ఆందోళన చేసిన పాడేరు కేజీబీవీ పాఠశాల విద్యార్థినులకు మంగళవారం అధికారులు విచారించారు. ఆందోళనకు దారి తీసిన అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఓ విచారణ కమిటీని ఇటీవల ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ఏటీడబ్ల్యూవో ఎల్.రజని, సీడీపీవో ఝాన్సీరాణి, ఎంఈవో సరస్వతీదేవి, గిరిజన సంక్షేమ కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి ఉన్నారు. ఈ నలుగురు అధికారులు మంగళవారం మధ్యాహ్నం కేజీబీవీని సందర్శించి, సమగ్ర విచారణ జరిపారు. కేజీబీవీ ఎస్‌వో, సీఆర్టీలు, ఆందోళన జరిగిన రోజు ఉదయం విధుల్లో ఉన్న పీఈటీ, హిందీ సీఆర్టీలను అధికారులు విచారణ చేశారు.

భాషా వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలి



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన అరకు ఎంపీ గొడ్డేటి మాధవి

సీఎంను కోరిన ఎంపీ మాధవి

సాక్షి,పాడేరు: అరకు పార్లమెంట్ పరిధిలోని ఆదివాసీ భాషా వలంటీర్లను రెన్యువల్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, 2008 డీఎస్సీ క్వాలీఫైడ్ అభ్యర్థులందరికీ పూర్తిస్థాయిలో నియామక పత్రాలు అందజేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కోరారు. తాడేపల్లిలోని అసెంబ్లీ కార్యాలయంలో ఆమె మంగళవారం సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. గురుకుల విద్యాలయాల్లో గెస్ట్ లెక్చరర్లను నియమించాలని, అరకులోయ మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని, పాఠశాలలో నాల్గవ తరగతి ఉద్యోగుల నియామకాలు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కోరినట్టు ఎంపీ మాధవి స్థానిక విలేకరులకు తెలిపారు. సమస్యల పరిష్కారానికి సీఎం సానుకూలంగా స్పందించాలరని ఎంపీ తెలిపారు.

ఆపరేషన్ పరివర్తన కార్యక్రమాలు విస్తృతం చేయాలి

- ప్రత్యామ్నాయ పంటల సాగుతో గంజాయి నిర్మూలన
- డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి అరకు ఎంపీ, పాడేరు ఎమ్మెల్యేలు వినతి


డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: గిరిజన ప్రాంతాల్లో గంజాయి నిర్మూలనకు ఆపరేషన్ పరివర్తన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని, రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిలు విన్నవించారు. అమరావతిలో వారు డీజీపీని కలిశారు. ఆపరేషన్ పరివర్తన కార్యక్రమం ద్వారా గంజాయి అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించి, గంజాయికు ప్రత్యామ్నాయంగా ఉద్యాన వన పంటల సాగుపై వ్యవసాయ నిపుణులతో పరిశోధనలు చేసి గిరిజనులు పండించుకునేలా ప్రోత్సహించాలని వినతిలో పేర్కొన్నారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగును మారుమూల గ్రామాల్లో చేపట్టాలని ఇందుకు అవసరమైన సహకారాన్ని పోలీసు యంత్రాంగం కూడా అందించాలని ఎంపీ, ఎమ్మెల్యేలు కోరారు.

అట్రాసిటీ కేసు నిందితుడిని జైలుకు పంపాలి


తహసీల్దార్ శ్రీధర్‌కు వినతి పత్రం అందచేస్తున్న ప్రజాప్రతినిధులు

వీఆర్‌పురం: వడ్డిగూడెం గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్న సోడె రాజకుమారిని విధుల్లో ఉండగా గూటాల శ్రీనివాస్ అనే వ్యక్తి దూషించడంతో అతనిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయ్యిందని, అతడిని వెంటనే రిమాండ్‌కు తరలించాలని వైఎస్సార్‌సీపీ గిరిజన ప్రజాప్రతినిధులు ఎంపీటీసీలు బంధం విజయలక్ష్మి, మిడియం రమాదేవి, సర్పంచ్‌లు పిట్టారామారావు, బంధం జయ, వద్దానపు శారద డిమాండ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ ఎస్.శ్రీధర్‌కు మంగళవారం వినతి పత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు కుట్రపూరితంగా గూటాల శ్రీనివాస్‌పై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని సీపీఎం నాయకులు గత ఆదివారం ర్యాలీ చేసి తహసీల్దార్‌కు మెమొరాండం ఇచ్చారని అన్నారు. దీన్ని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ ఖండిస్తుందన్నారు. గిరిజన వలంటీర్‌ను దుషించినందుకే ఆ వ్యక్తిపై పోలీసులు చట్టపరంగా కేసు నమోదు చేశారన్నారు. దీన్ని సీపీఎం నాయకులు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు మాచర్ల గంగులు, ముత్యాల మురళి, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, వైస్ ఎంపీపీ ముత్యాల భవానీ, ఇతర నాయకులు మామిడి వెంకటరమణ, ముత్యాల గౌతమ్, బంధం రాజు, మోడెం నరేష్, మోడెం రాజేష్, చిన రాజారావు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ కార్యక్రమం విజయవంతం చేయాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత



సాక్షి, పాడేరు: జిల్లాలోని అన్ని గ్రామాల్లో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ఈ నెల 21వ తేదీన విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సుజాత మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో రెండేళ్ల నుంచి 19ఏళ్ల వయస్సు నిండిన వారికి నులిపురుగుల నివారణ మాత్ర ఆల్బెండజోల్-400 తప్పనిసరిగా వేయించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,96,724 మందికి అవసరమైన నులిపురుగుల నివారణ మాత్రలను ప్రభుత్వం అందుబాటులో తెచ్చిందని తెలిపారు. పీహెచ్‌సీల పరిధిలోని వైద్య బృందాలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అన్ని మండలాల ఎంఈవోలు, ఏటీడబ్ల్యూవోలు, సీడీపీవోలు కూడా సహకరించాలని డీఎంహెచ్‌వో కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పాయకరావుపేట: పట్టణంలో గల కల్యాణి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మహిళ మృతి చెందినట్టు ఎస్ఐ ఎస్.రమేష్ తెలిపారు. పట్టణంలో కంటోన్మెంట్‌కు చెందిన ముత్యాల భాగ్యవతి (26) కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుందని, ఆపరేషన్ అనంతరం ప్రమాదవశాత్తు ఒత్తిడికిలోనై, ఫిట్స్ వచ్చి చికిత్స పొందుతూ మృతి చెందిందని తెలిపారు. మృతురాలి భర్త రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు.

'నులి'మేద్దాం రండి

- నులిపురుగుల నివారణకు ప్రభుత్వం చర్యలు
- ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి సిద్ధం
- నేడు నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం


స్పెషలడ్రైవ్‌పై వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి


నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం పోస్టర్

ముంచంగిపుట్టు: చిన్నారులను అనేక అనారోగ్య సమస్యలు పట్టి పీడిస్తుంటాయి. ముఖ్యంగా అపరిశుభ్రత కారణంగా చుట్టుముట్టే సమస్యలు తల్లిదండ్రులు గమనించేలోపే తీవ్రరూపం దాలుస్తాయి. వీటిలో నులిపురుగుల సమస్య ఒకటి. వీటి వల్ల రక్తహీనత సమస్య చిన్నారులను తీవ్రంగా బాధిస్తుంది. పిల్లల్లో రోగనిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. దీంతో పలు అనారోగ్య సమస్యలు తలెత్తే ఆస్కారముంది. సరిపడా ఆహారం తీసుకుంటున్నప్పటికీ పిల్లలు పేలవంగా కనిపిస్తుంటారు. పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపే నులిపురుగుల ప్రభావాన్ని కేవలం అల్బెండజోల్ మాత్రతో నివారించవచ్చు. దీని కోసం క్షేత్రస్థాయిలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు బుధవారం నిర్వహించనున్నారు. అన్ని అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో ఉచితంగా అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు. అల్లూరి జిల్లా లక్ష్యం 3,96,724 కాగా నాలుగు లక్షల మాత్రలు పంపిణీ అయినట్టు తెలిపారు. ఈ మేరకు సుమారు 60వేల పోస్టర్లు, 45వేలకు పైగా కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పిస్తున్నట్టు అధికారులు తెలిపారు. నులిపురుగుల అనర్థాలు, నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కిలగాడ పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్ ఇచ్చిన సూచనలివీ...

నులిపురుగుల వల్ల కలిగే అనర్థాలు:

- చిన్నారుల్లో రక్తహీనతను కలిగిస్తాయి.
- శారీరక, మానసిక ఎదుగుదలకు ఆటంకంగా మారుతాయి.
- నొప్పి, మంట, వికారం కలగచేస్తాయి.
- ఆహారం సహించదు, ఆకలి ఉండదు, నీరసం అని పిస్తుంది. వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది.
- వాంతులు, మలంలో రక్తం, అతిసారం వంటి సమస్యలు ప్రబలుతాయి.
- ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లల్లో నులిపురుగుల సమస్య ఎక్కువగా ఉంటుంది.

నివారణకు సూచనలు:

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- పిల్లల చేతిగోళ్లు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. గోళ్లు పెరిగితే వాటిలో చేరే మట్టివల్ల నులిపురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి.
- కలుషిత నీరు తాగరాదు. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయరాదు.
- కూరగాయలను శుభ్రంగా కడగాలి, భోజనం చేసే ముందు చేతులు సబ్బుతో కడుక్కోవాలి.ఆహార పదార్థాలపై మూతలు పెట్టాలి.

డోస్ ఇలా:

- ఏడాది నుంచి రెండేళ్ల లోపు పిల్లలకు సగం మాత్ర ఇవ్వాలి.లేదా సిరప్‌ను 5ఎంఎల్ చొప్పున ఇవ్వాలి.
- 2 నుంచి 19 ఏళ్లలోపు వారికి ఒక మాత్రను మధ్యాహ్న భోజనం తరువాత నమిలి మింగేలా చూడాలి. పరగడుపున వేయకూడదు.
- ఏదైన వ్యాధితో బాధపడుతున్నా, ఇతర మందులు వాడుతున్నా ఈ మాత్రలు ఇవ్వకూడదు.

స్పెషల్ డ్రైవ్‌పై అవగాహన



నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్ర తీసుకోవాలి. ఈ మాత్రను భోజనం తరువాత తీసుకోవాలి. మాత్ర వేసుకున్న ఒకటి, రెండు రోజుల్లో నులి పురుగులు ఉన్నట్లయితే మల విసర్జన ద్వారా బయటకు వెళ్తాయి. ప్రభుత్వ ఆదేశాలతో ఈనెల 21న ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నాం. కిలగాడ పీహెచ్‌సీ పరిధిలో 2079 మందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నాం. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

–ఎస్.రమేష్,
వైద్యాధికారి, కిలగాడ పీహెచ్‌సీ.

112 కిలోల గంజాయి, ఆశీస్ మిషన్లు స్వాధీనం

ఇద్దరి అరెస్టు


గంజాయి, మిషన్లు, నిందితులతో సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్ పోలీసులు


పెదబయిలు రోగులపేటలో స్వాధీనం చేసుకున్న గంజాయి,కారు.

జి.మాడుగుల: మండలంలో ఉరుము జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. మరో ముగ్గురు నిందితులు పరారయ్యారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం చింతపల్లి ఏఎస్పీ,(పాడేరు ఇన్‌ఛార్జి ఏఎస్పీ) ప్రతాప్ శివ కిశోర్ విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. జి.మాడుగుల- చింతపల్లి రోడ్డు మార్గంలో మంగళవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో 112 కిలోల గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురు వ్యక్తుల్లో ఇద్దరు మండలంలో వంజరి పంచాయతీ వెన్నెలకోట గ్రామానికి చెందిన పాంగి భాస్కరరావు, కొర్రా శివనారాయణను పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన ముగ్గురు జి.మాడుగుల మండలం నుర్మతికి చెందిన బాలకృష్ణ, జి.కె.వీధి మండలం ఏబులం గ్రామానికి చెందిన పాంగి కేశవ, చింతపల్లి మండలం అన్నవరం పంచాయతీ ఉప్పగుడిసెలు గ్రామానికి చెందిన గెమ్మెలి రాంబాబు పరారీలో ఉన్నారని చెప్పారు. పట్టుబడిన వారి వద్ద నుంచి 112 కిలోల గంజాయి, ఒక గంజాయి ప్యాకింగ్ మిషిన్, ఆశీస్ ఆయిల్ మేకింగ్ మిషన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని ఆయన తెలిపారు. శివనారాయణపై జి.మాడుగులలో ఒకటి, ముంచంగిపుట్టు పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు ఉన్నాయన్నారు. గిరిజన యువత గంజాయి పైలెట్, రవాణా చేసి జీవితాలు నాశనం చేసుకోవద్దని, జాబ్ మేళాలతో అనేక ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గంజాయిని, మిషన్లను చాకచక్యంగా పట్టు కొన్న సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్, సీఆర్‌పీఎఫ్ పార్టీలను ఆయన అభినందించారు. గంజాయి నిందితులపై కేసు నమో దు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాజా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

98 కిలోల గంజాయి పట్టివేత

పెదబయలు: రోగులపేట జంక్షన్ వద్ద మంగళవారం ఎస్ఈబీ, టాస్క్‌ఫోర్స్ అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా , 100 మీటర్ల దూరంలో ఓ కారును వదిలి పారిపోయారు. దీంతో అధికారులు కారు వద్దకు వెళ్లి చూస్తే 98 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. గంజాయి స్మగ్లరు, కారు ఎవరిది తదితర విషయాలపై ఆరా తీస్తున్నారు. భారీ వర్షంతో కారు వదిలి వెళ్లిన గంజాయి స్మగ్లర్లను పట్టుకునే అవకాశం లేకుండా పోయిందని టాస్క్‌ఫోర్స్ సీఐ కూర్మారావు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, కారును పాడేరు ఎస్ఈబీ స్టేషన్‌కు తరలించారు. సిబ్బంది ఉన్నారు.

వైజాగ్ నేవీ మారథాన్‌కు సన్నాహాలు

విశాఖ స్పోర్ట్స్: వైజాగ్ నేవీ మారథాన్ నిర్వహణకు తూర్పు నావికా దళం మరోసారి సిద్ధమైంది. నవంబర్ 13న విశాఖ సాగర తీరంలో ఈ పరుగు జరగనుంది. తూర్పు నావికా దళం ఆధ్వర్యంలో నాలుగు కేటగిరిల్లో ఈ మారథాన్ నిర్వహించనున్నామని మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైజాగ్ నేవీ మారథాన్ మస్కట్‌గా ఎంపిక చేసిన ఏపీ రాష్ట్ర జంతువు బ్లాక్ బక్‌ను ప్రదర్శించారు. రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహితంగా చేసేందుకు రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ నినాదంతో ఈ ఏడాది నేవీ మారథాన్ నిర్వహిస్తున్నామన్నారు. సాగర తీరంలోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద ప్రారంభించనున్న మారథాన్(42 కిలోమీటర్లు) ఐఎన్ఎస్ కళింగా వద్ద యూటర్న్ తీసుకుని ప్రారంభ పాయింట్‌కు చేరుకోవడంతో ముగియనుంది. 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్ జీవీపీ వద్ద, 10 కిలోమీటర్ల పరుగు తెన్నేటి పార్క్ వద్ద యూటర్న్ తీసుకోనుండగా, 5 కిలోమీటర్ల పరుగు వైఎస్సార్ విగ్రహం వద్ద యూ టర్న్ తీసుకుని తిరిగి ప్రారంభం వద్దకు చేరుకోవడంతో ముగి యనుంది. మారథాన్‌లో పాల్గొనాలనే ఉత్సాహవంతులు వైజాగ్ నేవీ మారథాన్ అనే వెబ్‌సైట్‌లో ఎంట్రీలు నమోదు చేసుకోవచ్చన్నారు.

బైకు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


బైకు ప్రమాదంలో గాయపడిన ఆనంద్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

చింతపల్లి: బైకు ప్రమాదంలో మంగళవారం ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్సల అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. గూడెంకొత్తవీధి మండలం ఆర్.వి.నగర్‌కు చెందిన పండ ఆనంద్ ద్విచక్ర వాహనంపై చింతపల్లి వచ్చి తిరిగి వెళుతుండగా ఏబులం వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలు కావడంతో 108 వాహనంలో స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన డిప్యూటీ సివిల్ సర్జన్ మహేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉండడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్నట్టు తెలిపారు.

సీఏ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదని రైలు కింద పడి ఆత్మహత్య

అనకాపల్లిటౌన్: పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించలేదనే మనస్తాపంతో ఓ విద్యార్థి సోమవారం రైలుకింద బలవన్మరణానికి పాల్పడ్డాడు. దువ్వాడ జీఆర్‌పీ ఎస్ఐ శాంతారాం అందించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలో గవరపాలెం పొలిమేరవీధికి చెందిన మళ్ల సత్తిబాబు కుమారుడు వరహా రవిశంకర్(26) చార్టెడ్ అకౌంట్ పరీక్షా ఫలితాల్లో ఫెయిలయ్యాడని ఎస్ఐ పేర్కొన్నారు. ఈవిషయం కుటుంబసభ్యులకు తెలిస్తే మందలిస్తారనే భయంతో అదే రోజు రాత్రి రెండో ఆట సినిమాకెళ్లివస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన రవిశంకర్ తిరిగి రాలేదు. సదరు వీధికి చెందిన కొంతమంది రైలుపట్టాలపై ఉన్న రవిశంకర్‌ను గుర్తించి కుటుంబసభ్యులకు తెలియజేశారని ఎస్ఐ చెప్పారు. ఆ విద్యార్థి కోరమండల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్టు స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

పశువైద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వం

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అయ్యన్నపాత్రుడు

కొయ్యూరు: రాష్ట్ర ప్రభుత్వం పశువైద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు విమర్శించారు. టీడీపీ హయాంలో పశువైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చినట్టు చెప్పారు. ఆయన మంగళవారం కొయ్యూరు వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. సచివాలయ సిబ్బందికి పనులు లేక ఖాళీగా ఉంటున్నారన్నారు. మూడు రాజధానుల విషయంలో ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం అబద్ధాలు ఆడుతోందని విమర్శించారు. ఈ సమావేశంలో టీడీపీ నేత ఎం.వి.ఎస్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం


రక్తదానం చేస్తున్న యువత

మారేడుమిల్లి: రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఇంకొకరికి ప్రాణదానం చేయవచ్చని, ప్రతి వ్యక్తి రక్తదానం చేయాలని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ అనూష అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, యువతీ, యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. మారేడుమిల్లి, రంపచోడవరం డాక్టర్లు రాధిక, శ్రీవల్లి, స్టాఫ్ నర్సు జయ, వాసు, పండుకుమార్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కూలీ హత్య కేసులో న్యాయం చేయాలి

జేసీని కోరిన సీఐటీయూ నాయకులు


జేసీకి వినతి పత్రం సమర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం సెజ్‌లో హత్యకు గురైన గిరిజన మహిళ కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.రాము, ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారిని కోరారు. ఈ మేరకు మంగళవారం వారు వినతి పత్రం అందజేశారు. హత్యకు గురైన గిరిజన మహిళ కుటుంబానికి రిలీఫ్ ఫండ్ ఇప్పించాలన్నారు. సెజ్‌లో పని చేస్తున్న కార్మికుల జీవనం దయనీయంగా ఉందని తెలిపారు. వలస కూలీలకు భద్రత కల్పించడంతో పాటు, సెజ్‌లోని యాజమాన్యాలు వారికి తగిన సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని జేసీకి విజ్ఞప్తి చేశారు.

కునుకూరులో ఏడాదిన్నర పాప మృతి

కొద్ది రోజులుగా చిన్నారికి అనారోగ్యం


తల్లి ఒడిలో మరణించిన పాప

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ కునుకూరులో ఏడాదిన్నర పాప అనారోగ్యంతో ఆదివారం రాత్రి మరణించింది. గెమ్మెలి జ్యోతి, సురేష్‌లకు ఏడాదిన్నర కిందట పాప పుట్టింది. కొద్ది రోజుల వరకు ఆమె ఆరోగ్యంగా ఉన్నా తరువాత అనారోగ్యం సోకింది. వైద్యులకు చూపించినా ఫలితం లేదు. ఆదివారం రాత్రి తీవ్ర అనారోగ్యానికి గురైన పాప మరణించింది. ఈ విషయాన్ని తల్లిదండ్రులు సురేష్, జ్యోతి మంగళవారం విలేకరులకు తెలిపారు. గతంలో పాపను కేజీహెచ్‌కు తీసుకెళ్లి చూపించాలని కోరామని, అయితే తల్లిదండ్రులు తీసుకెళ్లలేదని వైద్య సిబ్బంది తెలిపారు. పాప మృతిపై గ్రామంలో విషాదం నెలకొంది.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఇన్‌చార్జి ఏఎస్పీ


రాజవొమ్మంగి స్టేషన్‌ను సందర్శించిన ఏఎస్పీ మహేశ్వరరెడ్డి

రాజవొమ్మంగి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను రంపచోడవరం ఇన్‌చార్జ్ ఏఎస్పీ మహేశ్వరరెడ్డి మంగళవారం సందర్శించారు. రక్షణపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక సీఐ రవికుమార్‌తో చర్చించారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఎస్ఐ గోపీనరేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ


వాహనచోదకుల రికార్డులు పరిశీలిస్తున్న పోలీసులు

కొయ్యూరు/అరకులోయ రూరల్: మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వారోత్సవాల నేపథ్యంలో పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఏజెన్సీ వ్యాప్తంగా విస్తృతంగా వాహన తనిఖీలు, చేపడుతున్నారు. ఇందులో భాగంగా కొయ్యూరు మండలం బూదరాళ్ల వద్ద మంప ఎస్ఐ లోకేష్‌కుమార్, అరకులోయలో ఎస్ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనాలు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనుమానితుల వివరాలు నమోదు చేసుకున్నారు. కొయ్యూరు, మంప స్టేషన్లను చింతపల్లి ఏఎస్పీ కిషోర్ సోమవారం తనిఖీ చేసిన పోలీసులకు పలు సూచనలిచ్చారు.

క్లుప్తంగా

మౌలిక సదుపాయాల కల్పనకు తీర్మానం


సమావేశంలో పాల్గొన్న వైద్యులు, ఎంపీపీ తదితరులు

వై.రామవరం: స్థానిక సీహెచ్‌సీలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.గౌతమి అధ్యక్షతన మంగళవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది.
ఎంపీపీ కడబాల ఆనందరావు, వైస్ ఎంపీపీ ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, అన్ని మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆస్పత్రిలో పాడైన జనరేటర్ స్థానంలో కొత్తది ఏర్పాటుతో పాటు పలు సదుపాయాల కల్పన కోసం తీర్మానం చేశారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో పర్యటించారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు త్రిమూర్తులు, పంచాయతీ కార్యదర్శి మధుసూధనరాజు, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ రాహుల్, ఎస్‌ఎన్‌సీయు వైద్యాధికారి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగు కో-ఆర్డినేటర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు చేస్తున్న జిల్లా అక్షర వెలుగు ప్రాజెక్టు మేనేజర్లు రామారావు, భాగ్యలక్ష్మి

అరకులోయ రూరల్: స్థానిక జెడ్పీ అతిథి గృహం వద్ద పాడేరు, అరకులోయ, అనంతగిరి, పెదబయలు మండలాల్లో ఖాళీగా ఉన్న వెలుగు కో-ఆర్డినేటర్ల పోస్టులకు మంగళవారం ఇంటర్వ్యూలు జరిగాయి. ఆయా మండలాల్లో ఖాళీగా ఉన్న ఆరు పోస్టులకు 51 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అక్షర వెలుగు ప్రాజెక్టు జిల్లా మేనేజర్లు రామారావు, భాగ్య లక్ష్మి ఇంటర్వ్యూలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో అక్షరాస్యతను పెంచేందుకు అక్షర వెలుగు ప్రాజెక్టు ఏర్పాటైందన్నారు. పంచాయతీ కో-ఆర్డినేటర్ల నియ మాక ప్రక్రియ పూర్తి చేశామని, త్వరలోనే గ్రామ ల్లో విద్యాభ్యాస ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. వారం రోజుల్లో ఫలితాలు ప్రకటిస్తామన్నారు.

క్రమశిక్షణతో మెరుగైన బోధన


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

కొయ్యూరు: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో మంగళవారం జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన ఉత్తమ మెరుగైన బోధన అందిస్తున్నామన్నారు. విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు కూడా శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇకపై నెలలో ఒక ఆదివారం మాత్రమే పిల్లలను కలిసేందుకు తల్లిదండ్రులను అనుమతిస్తామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ మోహన్, పాఠశాల కమిటీ ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న మండల సర్పంచ్‌ల ఫోరం గౌరవ అధ్యక్షుడు రాంబాబు

జి.మాడుగుల: మత్స్యమాడుగులమ్మ చెరువుకు సమీపంలో సోలార్ తాగునీటి పథకం నిర్మాణ పనులను మండల సర్పంచ్‌ల ఫోరం గౌరవ అధ్యక్షుడు రాంబాబు మంగళవారం ప్రారంభించారు. ఎంపీటీసీ సన్యాసిదొర తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో మేలు


అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

అరకులోయ రూరల్: స్థానిక వెలుగు కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో సీడబ్ల్యూఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్ సుధాకర్ డేవిడ్ మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల వినియోగంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. డేవిడ్, సునిల్‌కుమార్, బాలరాజు, రత్నకుమారి,రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి మోక్షం

- కోరుకొండ పీహెచ్‌సీ పునర్నిర్మాణ పనులు
- పనులకు నిధులు మంజూరు చేయకుండా వదిలేసిన టీడీపీ
- నిధుల మంజూరుతో అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేస్తున్న ప్రభుత్వ ప్రభుత్వం


పనులు పునఃప్రారంభించిన కోరుకొండ పీహెచ్‌సీ నూతన భవనం


వైద్య సేవలందిస్తున్న పీహెచ్‌సీ పాత భవనం

చింతపలి రూరల్: టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురిచేసిన కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పునర్జీవం పోసింది. పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 36 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ముంచంగిపుట్టు, చింతపల్లి మండలం కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మాత్రమే శాశ్వత భవనాలు లేవు. గత టీడీపీ ప్రభుత్వం 2018లో కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం నిర్మాణానికి రూ.90లక్షల ఎస్‌సీపీ నిధులు విడుదల చేసి నిర్మాణ బాధ్యతలను ఓ కాంట్రాక్టర్‌కి అప్పగించింది. కాంట్రాక్టర్ ఏడాది కాలంలో పునాదులు, పిల్లర్ల నిర్మాణాలు పూర్తి చేశాడు. నిర్మాణాలకు సంబంధించి పైసా నిధులు కూడా గత టీడీపీ ప్రభుత్వం మంజూరు చేయలేదు. ఈ కారణంగా భవనం నిర్మాణాలను కాంట్రాక్టర్ అర్థంతరంగా నిలిపివేశాడు.

65 గ్రామాల ప్రజలకు పెద్ద దిక్కు

కోరుకొండ పీహెచ్‌సీ 65గ్రామాల ప్రజలకు పెద్దదిక్కు. బలపం పంచాయతీ పరిధిలోని 33 గ్రామాలు, తమ్మంగుల, కుడుముసారి పంచాయతీ పరిధిలో మరో 32గ్రామస్తులు వచ్చి వైద్యసేవలు పొందుతున్నారు. పాత భవనంలో కొనసాగుతున పీహెచ్‌సీ వసతి సమస్య ఉంది. వైద్యాధికారికి ఒక్కరికి మాత్రమే ఒక గది ఉంది. సిబ్బంది ఆరుబయట కూర్చొని సేవలందించాల్సి వస్తుంది. ప్రసూతి విభాగం లేదు. దీంతో గర్భిణులను సుమారు 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న లోతుగెడ్డ పీహెచ్‌సీకి తరలించాల్సి వస్తుంది. వర్షాకాలం భవనం కారిపోతుండడంతో సిబ్బంది, రోగులు ఇబ్బందులను ఎదుర్కోవాల్సివస్తుంది.

ఐటీడీఏ పీవో చొరవతో

కోరుకొండ పీహెచ్‌సీ అసంపూర్తి భవనం పూర్తి చేసేందుకు పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందులో భాగంగా ఆయన పీహెచ్‌సీని పరిశీలించి, సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు మంజూరు చేసింది. తొలివిడతగా రూ.14లక్షల నిధులు సదరు కాంట్రాక్టర్‌కు పీవో మంజూరు చేశారు. నవంబరు 15తేదీ నాటికి భవనం అందుబాటులో తీసుకురావాలి ఇంజినీరింగ్ అధికారులను పీవో ఆదేశించారు. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. దీంతో ప్రాంతీయ ఆదివాసీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజనాభివృద్ధే ముఖ్యమంత్రి లక్ష్యం



గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. టీడీపీ ప్రభుత్వం అసంపూర్తిగా నిలిపివేసిన భవనాలు, రహదారులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి చేస్తోంది. కోరుకొండ పీహెచ్‌సీ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో ప్రాంతీయ ఆదివాసీలు ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

-దురియా పుష్పలత, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు, చింతపల్లి

పనులు వేగవంతం



కోరుకొండ పీహెచ్‌సీ భవనాన్ని నిర్ణయిత సమయానికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సోమవారం శ్లాబ్ పనులు పూర్తి చేశాం. పీవో నిర్దేశించిన సమయానికి పీహెచ్‌పీ భవనం వినియోగంలోకి తీసుకొచ్చేందుకు పనులు వేగవంతం చేశాం.

-డి.వి.ఆర్.ఎం.రాజు, ఈఈ, పాడేరు

విద్యార్థులకు సోలార్ స్టడీ లైట్లు పంపిణీ


విద్యార్థులకు సోలార్ లైట్లు అందజేస్తున్న పడాల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

అడ్డతీగల: విద్యుత్ అంతరాయాల సమయంలో విద్యార్థులకు సహాయపడేలా సోలార్ స్టడీలైట్లు అందజేస్తున్నట్టు కాకినాడకు చెందిన పడాల చారిటబుల్ ట్రస్ట్ ప్రోగ్రాం మేనేజర్ కె.వెంకటప్రసాద్ తెలిపారు. అడ్డతీగల మండలం ఎల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు సోలార్ స్టడీలైట్లు అందజేశారు. హైదరాబాద్‌కి చెందిన వన్ చైల్డ్ వన్ లైట్ సంస్థతో తమ సంస్థ సంయుక్తంగా కలసి సోలార్ లైట్లు పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. మొదటి విడతగా పాఠశాలలో పదో తరగతికి చెందిన 28 మంది విద్యార్థులకు పడాల్ ట్రస్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి కె.శ్రీనివాస్‌తో కలిసి పంపిణీ చేశామన్నారు. ఏజెన్సీలో విద్యాభివృద్ధికి ట్రస్ట్ నిరంతరం కృష చేస్తోందన్నారు. వారధి అనే ప్రాజెక్ట్‌తో 600 మందికి పైగా అనాథ విద్యార్థులకు విద్య ,వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ, మహేష్, ఏఎస్‌ఐ మోహన్

అరకులోయ రూరల్: ఆర్‌పీఎఫ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం యండపల్లివలస రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ మహేష్ విస్తృతంగా మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐలు మోహన్,రమేష్ , సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు


గుంటసీమలో మేకలకు వైద్యసేవలందిస్తున్న సిబ్బంది

దుంబ్రిగూడ: మండలంలోని గుంటసీమ, రంగేలిసింగ్ పంచాయతీ కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. పశువైద్యాధికారి డాక్టర్ గౌతమ్ మాట్లాడుతూ శిబిరాల్లో 312 పశువులకు, 531 మేకలు, 410 గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు. పశువ్యాధులపై అవగాహన కల్పించామన్నారు. సిబ్బంది అనురాధ, సుబ్బారావు, సంజీవ్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.


చీడిపాలెంలో గొర్రెలకు టీకాలు వేస్తున్న సిబ్బంది

గంగవరం: చీడిపాలెంలో పశువైద్య శిబిరం నిర్వహించి 342 పశువులకు, 245 మేకలు, 164 గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్టు నెల్లిపూడి గ్రామీణ పశువైద్యశాల వైద్యాధికారి పి.అప్పన్నబాబు చెప్పారు. సిబ్బంది నాగేశ్వరరావు, కీర్తన, చిన్నిబాబు, క్రాంతి, వెంకటేశ్వర్లు, బషీర్‌బీబీ, తరుణ్, నవ్య పాల్గొన్నారు.

పసుపు శుద్ధి యంత్రాల పంపిణీ


యంత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ లక్ష్మి

గూడెంకొత్తవీధి : ఐటీడీఏ సహకారంతో వందశాతం రాయితీపై అందిస్తున్న పసుపు యంత్రాలను కోరాపల్లి గ్రామంలో రైతులకు సర్పంచ్ లక్ష్మి మంగళవారం అందజేశారు. ఐటీడీఏ అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీటీసీ ఈశ్వరమ్మ, వీహెచ్‌ఏ సంగీత, వైఎస్సార్‌సీపీ నేత వెంకటరావు, వార్డు సభ్యుడు నవీన్ పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘంతో ఆర్థికాభివృద్ధి


మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ వెంకటగంగరాజు

జి.మాడుగుల: సింగర్బ పంచాయతీ ఎం.నిట్టాపుట్టు గ్రామంలో మంగళవారం గిరిజన రైతు సేవా ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం (ఎఫ్‌పీవో)వార్షిక సభ జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు మత్స్యరాస వెంకటగంగరాజు(బుజ్జి) మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘం వలన రైతులకు గిట్టుబాటు కలుగుతుందని, తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. సర్పంచ్ హనుమంతరావు, ఎఫ్‌పీవో సీఈవో చైర్‌పర్సన్, డైరెక్టర్లు, ప్రకృతి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దుష్ప్రచారం తగదు

వీఆర్ పురం: రేఖపల్లిలో మంగళవారం జరిగిన సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బాలు మాట్లాడుతూ వరద బాధితులకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుందని, దీనిపై సీపీఎం నేతలు తప్పుడు ప్రచారం చేయడం దారుణ మన్నారు. ఇకపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మురళి, వెంకటరమణ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

చింతపల్లిరూరల్: చింతపల్లి, జీకేవీధి మండలాల వ్యవసాయ అధికారులతో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జాహ్నవి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో 54,066 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటల సాగు ఉన్నప్పటికీ 37,676 ఎకరాలకు మాత్రమే ఈ-క్రాప్ జరిగిందన్నారు. రైతులందరూ ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని కోరారు. ఏవోలు కన్నబాబు, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సమస్యలపై వినతి


ఎంపీపీ కృష్ణారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న హెచ్‌ఎం జగ్గారెడ్డి

గంగవరం : టేకులవీధి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, ఎంఈవో మల్లేశ్వరరావు మంగళవారం సందర్శించారు. పాఠశాలలోని మైదానం చదును చేయించాలని, ప్రహరీ నిర్మించాలని, పాఠశాల వరకు రోడ్డు నిర్మించాలని కోరుతూ హెచ్‌ఎం జగ్గారెడ్డి వినతిపత్రం అందజేశారు. సమస్యలను ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీపీ హామీ ఇచ్చారు.

ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్‌గా కృష్ణారావు

రాజవొమ్మంగి: స్థానిక ఈఎంఆర్ఎస్ (ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల) ప్రిన్సిపాల్‌గా ఎం.వి.కృష్ణారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన అజిత్‌కుమార్ శ్రీకాకుళం జిల్లా పెద్దడి గురుకుల బాలుర పాఠశాలకు బదిలీ అయ్యారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

రంపచోడవరం: నరసాపురం పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండాలని ఎంపీటీసీ కుంజం వంశీ చెప్పారు. మంగళవారం సాయంత్రం 4గంటలకు వైద్యుడు అందుబాటులో లేనట్టు ఆయనకు పలువురు తెలియజేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ విషయాన్ని ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్తామన్నారు.

వైద్యుల నియామకం కోసం వినతి


కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

చింతూరు: స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్యులను నియమించాలని కోరుతూ ఎస్టీ కమిషన్ సభ్యుడు మురళీ, సర్పంచ్ చంద్రయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రామలింగారెడ్డి తదితరులు సోమవారం రాత్రి పాడేరులో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. విలీన మండలాల్లో డెంగ్యూ వ్యాధులు ప్రబలి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందించి వారం రోజుల్లో వైద్యులు నియమిస్తామని హామీ ఇచ్చారని నాయకులు చెప్పారు.

సీఐటీయూ నేతల ఆందోళన

సాక్షి, పాడేరు/చింతూరు/రంపచోడవరం: పాడేరు, చింతూరు, రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయాల ఎదుట సీఐటీయూ నాయకులు మంగళవారం ధర్నా చేశారు.నాయకులు మాట్లాడుతూ అసంఘిత రంగ కార్మికులకు కనీస వేతనం అమలుచేయాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ఉన్నతాధికారులకు అందజేశారు. చిన్నయ్యపడాల్, అప్పలనర్స, రామరాజు, శాంతిరాజు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి గురుకులంలో ఇంటర్ క్వార్టర్లీ పరీక్షలు

రాజవొమ్మంగి: ఈనెల 26వ తేదీ నుంచి ఇంటర్ క్వార్టర్లీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు రాజవొమ్మంగి ఏపీ. గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ తెలిపారు. ఈ పరీక్షలు అక్టోబర్ ఒకటవ తేదీ వరకు జరుగుతాయన్నారు. రెండవ తేదీ నుంచి 9 వరకు దసరా సెలవులు ప్రకటించడం జరుగుతుందన్నారు.

గ్రామాల్లో బీజేపీ పోరుయాత్ర


ముంచంగిపుట్టులో బీజేపీ నాయకుల ర్యాలీ

ముంచంగిపుట్టు/అడ్డతీగల : ముంచంగిపుట్టు మండలం దోడిపుట్టు పంచాయతీతో పాటు తలబిరాడ గ్రామం, అడ్డతీగల మండలం వీరవరంలో బీజేపీ నాయకులు పోరుయాత్ర చేపట్టారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను వివరించారు. నాయకులు రాజారావు, శాంతకుమారి, లక్ష్మణ్, సత్యనారాయణరెడ్డి, స్వప్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

ముంచంగిపుట్టు: 14,15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని దార్రెల సర్పంచ్ పాండురంగస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గ్రామస్తులతో కలిసి మాట్లాడారు. యంత్రాంగం స్పందించి నిధులు విడుదల చేస్తే పంచాయతీలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు.

టూరిజంలో పోస్టులను గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలి

మంత్రి ఆర్‌కే రోజాకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ వినతి


పర్యాటకశాఖ మంత్రి రోజాకు వినతిపత్రం అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పక్కన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ

సాక్షి, పాడేరు : ఆంధ్రా ఊటీగా పేరొందిన అరకులోయ పర్యాటక ప్రాంతంలో టూరిజం శాఖలోని ఖాళీగా ఉన్న పోస్టులను గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేయాలని టూరిజం, సాంస్కృతికశాఖ మంత్రి ఆర్‌కే రోజాకు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ వినతిపత్రం అందజేశారు. వెలగపూడి సచివాలయంలో మంత్రి ఆర్‌కే రోజాను మంగళవారం ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కలిసి అరకులోయ నియోజకవర్గంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, టూరిజం శాఖలోని ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించి సమీక్షించారు. ఈ మేరకు పర్యాటక ప్రాంతం బొర్రా గుహలులో గైడ్ పోస్టులకు గిరిజన అభ్యర్థులను నియమించాలని, అరకులోయ, అనంతగిరి, అనంతగిరి జంగిల్ బెల్స్, బొర్రాగుహలు ప్రాంతాల్లోని టూరిజం కేంద్రాలు, రిసార్టులు, రెస్టారెంట్లు, ఇతర పర్యాటక ప్రాంతాల్లో ఖాళీ పోస్టులను స్థానిక గిరిజన అభ్యర్థులతో భర్తీ చేసి, వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా మంత్రి ఆర్‌కే రోజా మాట్లాడుతూ టూరిజం శాఖలో ఖాళీ పోస్టులను స్థానిక గిరిజనులతోనే భర్తీ చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని, పర్యాటక ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు స్థానికులకే కల్పిస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


సంతలో వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ వాసు

జి.మాడుగుల: సంతబయలు గ్రామంలో మంగళవారం జరిగిన వారపు సంతలో ట్రాఫిక్ నిబంధనలపై మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వాసు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు డ్రైవింగ్ లైసెన్సు, వాహన రికార్డులు దగ్గర ఉంచుకోవాలని, సామర్థ్యాన్ని మించి ప్రమాణికులు తీసుకెళ్లొద్దని, అతి వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడొద్దని ఆయన సూచించారు. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

చింతపల్లి: మండల కేంద్రంలో జిల్లా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వాసు మంగళవారం వాహన తనిఖీలు చేశారు. వాహనచోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు పాటించని పలు వాహనాలపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుము విధించారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి


కాలినడకన బొర్రబాకురు గ్రామానికి వెళ్తున్న జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం

హుకుంపేట: కొట్నాపల్లి పంచాయతీ గొందివలస, బిసయిపుట్టు, బొర్రబాకురు గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, స్థానిక నాయకులతో కలిసి మంగళవారం పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గొందివలస గ్రామం నుంచి నాలుగు కిలోమీటర్ల మేర వాగులు, గుట్టలు దాటుకుంటు కాలినడకన బొర్రబాకురు గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి రహదారి లేదని స్థానికులు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లి గ్రామంలో రోడ్డు నిర్మాణానికి ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ బొంజుబాబు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగ కార్యదర్శి వెంకట్, నాయకులు వెంకట్, శివాజీ, రాజారావు, గణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయిబాబా విగ్రహ ప్రతిష్ట


గాంధీనగరంలో ఏర్పాటు చేసిన షిర్డీ సాయిబాబా విగ్రహం

జి.మాడుగుల: గాంధీనగర్ గ్రామంలో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో షిర్డీసాయి బాబా విగ్రహాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రతిష్టించారు. భీమిలి సద్గురు సేవా ఆశ్రమం ప్రతినిధి సాయిరాం స్వామిజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో షిర్డీసాయి బాబా విగ్రహాలను ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ఎంపీడీవో లోహిత్ జయసాగర్, తహసీల్దార్ అప్పలస్వామి, ఈవోపీఆర్డీ ఆర్.వి.ఎస్. రమేష్, సర్పంచ్ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి నాయుడుతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన


చెల్లింపు పత్రాన్ని చిన్నారుల తల్లులకు అందజేస్తున్న అధికారులు, బీపీఎం వెంకటలక్ష్మి

కొయ్యూరు: రాజేంద్రపాలెం పంచాయతీ సోలాబు గ్రామంలో మంగళవారం నర్సీపట్నం ఈస్ట్ సబ్ డివిజన్ తపాల శాఖ ఇన్‌స్పెక్టర్ కుమార్, ఏబీపీఎం నాగేశ్వరరావు తదితరులు గ్రామస్తులకు పోస్టల్ పథకాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పోస్టల్ పొదుపు పథకాల సద్వినియోగంతో ఆర్థికాభివృద్ధి పొందవచ్చన్నారు. కొయ్యూరు ఎస్‌వో పరిధిలో కాకరపాడు బ్రాంచి కార్యాలయం ఉందని, సేవలు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా సోలాబు గ్రామానికి చెందిన కొందరు పిల్లలకు సుకన్య సమృద్ధి యోజన పథకానికి సంబంధించిన మొదటి ప్రీమియం సొమ్మును కాకరపాడు బీపీఎం ఎస్.వెంకటలక్ష్మి చెల్లించారు.

అదనపు ఎంఈవోల నియామకం హర్షణీయం


మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం నేతలు

సాక్షి, పాడేరు : తలారిసింగి సీఏహెచ్ స్కూల్‌లో గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం సభ్యులు మంగళవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర గౌరవాధ్యకుడు శ్రీనివాస్ పడాల్, రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు కృష్ణారావు తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి మండలానికి ఇద్దరు ఎంఈవోల నియామకానికి చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. రెండవ ఎంఈవో పోస్టులకు సంబంధించి హెచ్ఎంల పదోన్నతులపై గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులను కూడా తగిన న్యాయం చేయాలని వారు కోరారు. రీమలి జాన్, నీలకంఠం, శ్రీనివాసు దొర, ప్రసాద్, చిట్టిబాబు, రాంబాబు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు గైనకాలజిస్ట్‌ల నియామకం

చింతపల్లి: స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలో ఇద్దరు గైనకాలజిస్టలను నియమించినట్టు డిప్యూటీ సివిల్ సర్జన్ మహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు విధుల్లో చేరారన్నారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న సుధా శారద, ఆదిత్య కిర్తీలను గైనకాలజిస్టలుగా నియమించారన్నారు. దీంతో ఆస్పత్రిలో సేవలు మరింత మెరుగుపడ్డాయని ఆయన తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అరకులోయ : ఈ నెల 24న ఎన్‌ఎస్ఎస్ దినోత్సవాన్ని పురష్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం నవీన భారతదేశం-విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కె.పద్మలత, నాగబాబు, విజయ లక్ష్మి పాల్గొన్నారు.